

"రూపాయి విలువ బాగా పడిపోయింది." అన్నాడు జగన్నాధం నిరాశనూ, విచారాన్ని స్ఫురింపజేస్తూ— యిక దినపత్రిక చూడబుద్ధికాదన్నట్లు దానిని మడిచివేస్తూ

"అంతకంటె మనిషివిలువ మరీ బాగా పడిపోయింది దానికి నువ్వు విచారించినట్టులేదు" అన్నాడు రాజారావు తాను చదువుతున్న మరో పేపరు క్రిందికిదించి

"మనదేశంలో రూపాయి అంతటా ఒక్కటే. కాని మనుష్యులందరూ ఒకటి కాదు ఒక్కొక్క మనిషి విలువ అతని చదువుమీద, సంస్కారంమీద, అతను పుట్టిపెరిగిన వాతావరణంమీద, ఆర్థిక స్తోమతమీద, ఆలోచనమీద, యిలాగ ఎన్నో అంశాలమీద ఆధారపడి వుంటుంది ఎవరో ఎక్కడో దిగజారిపోయినారని మొత్తం మానవసమాజమంతా చెడిపోయిందని అంచనా వేయడానికి వీలులేదు" అన్నాడు జగన్నాధం.

"నువ్వు చెప్పినది కొంతవరకూ ఒప్పుకుంటాను ప్రభుత్వం చలామణీ చేసే 'మనీ' అంతా ఒకటేననీ సృష్టికర్త సృష్టించిన మానవులందరూ మాత్రం ఒకటి కాదనీ నీ అభిప్రాయం.

కాని మానవసమాజాన్నంతటినీ తీసుకొని అందులో సగటు మానవుణ్ణి ఊహించు కొంటే మన ఊహకువచ్చే వ్యక్తిని నేను "మనిష"ంటున్నాను .ఆ సగటు మనిషి విలువ ఒక్కొక్క తరానికీ దిగజారి పోతోంది బహుశా 'మనీ'కి మనిషి జీవితానికీ వున్నసంబంధం నానాటికీ పెరగడంతో, డబ్బుతోపాటే మనిషి విలువలో తగ్గుదల ఏర్పడుతూ, మనిషి మూలవిలువలో దిగజారుడు ప్రత్యక్షంగా కనపడుతోంది" అన్నాడు రాజారావు.

"నువ్వు వృత్తిరీత్యా ప్లీడరువైతే అవవచ్చునుగాని, సగటు మనిషిని తీసుకున్నా మనదేశంలోని ఆధ్యాత్మిక విలువలూ, ధార్మిక విలువలూ, నైతిక విలువలూ యివన్నీ మంటగలిపి, ఆలోచన, వివేచనాశక్తులు గలిగిన మానవుడు వివేకం కోల్పోయి ప్రాణంలేని డబ్బుతో తన జీవితాన్ని ముడిపెట్టుకొని, తన విలువను నాశనం చేసుకుంటాడండే మాత్రం నేను అంగీకరించను." అన్నాడు జగన్నాథం.

"మీ అందరితోనూ వచ్చిన చిక్కిదే నయ్యా, ప్లీడరు అన్నవాడు కోర్టులో తప్ప మరెక్కడా నోరు విప్పగూడదనీ, మాట్లాడగూడదనీ, మీ అభిప్రాయమేమో. నేను నిన్ను నమ్మించినా, ఒప్పించినా నువ్వు నాకిచ్చే ఫీజేమీలేదు నువ్వు ఒక విషయాన్ని కదిపావు దానిమీద నాకు తోచినది నేనన్నాను. ఇందులో వాద ప్రతివాదనలకూ, అభిప్రాయభేదాలకూ, గెలుపు ఓటములకూ ఎక్కడా చోటే లేదు. నువ్వు నాతో ఏకీభవించకపోతే నేనేమీ బాధపడను. కాని ఒక్కటి మాత్రం నువ్వు గుర్తుంచుకో. డబ్బుకి ప్రాణం లేకపోయినా, శక్తి వుంది. ఆ శక్తి మన చదువుని, సంస్కారాన్ని, నీతిని, నియమాలను అన్నిటినీ వమ్ము చేసి దుమ్ములో కలపగలిగిన శక్తి. కాంతాశక్తిని మించిన శక్తి కనకానిది" అని రాజారావు కొంచెం ఆవేశంతో చెపి చదువుకునేందుకు పేపరెత్తాడు.

"ఓహో, లాయరుగారికి కోపం వచ్చినట్టుంది. ఇంతవరకూ మన చర్చను బిగిలాక్కొచ్చి, యిప్పుడు వదిలేస్తే 'శేషం కోపేన పూరయేత్' అన్నట్లవుతుంది పోనీ, నేను నీతో వాదించను గాని, సగటు మనిషివిలువ ఎలా పడిపోయిందో చెప్పు చూద్దాం నీ దగ్గరికి అనేక రకాల మనుష్యులూ, అనేక రకాలైన కేసులూ వస్తూ వుంటాయి మనుష్యుల మనస్తత్వ పరిశీలనకు మీకు ఎక్కువ సావకాశం వుంటుంది ఇంజనీరుని నాకేం తెలుస్తుంది ఎంతసేపూ ఎస్టిమేట్లూ, టెండర్లూ, పనులు పూర్తి చేయించడంతప్ప" అన్నాడు జగన్నాథం రాజాధోరణిలో.

క్లబ్బులో వారిద్దరి సంభాషణ ఎలా ముగుస్తుందోనని కుతూహలంతో మరో

టేబిలు దగ్గర కొద్దిదూరంలో కూర్చుని వింటున్న, సుందరరామం, అన్నయ్యశాస్త్రి, కన్నయ్యదొర, వెంకట్రావుగారు తమ కుర్చీలు రాజారావు కుర్చీకి దగ్గరగా జరుపుకున్నారు.

జగన్నాథం ఆర్డరుచేసిన కాఫీలు వొచ్చాయి. "ఈ కాఫీలిచ్చి మమ్మల్ని ఋణగ్రస్థుల్ని చేశారు జగన్నాథంగారు. రెండు పేకదస్తాలతో రమ్మీ ఆడను, మరో ముగ్గురొస్తే మూడు పేకలమీద ఏడుగురూ ఆడుకోవచ్చునంటాడు అన్నయ్యశాస్త్రి. అతను తగ్గిపోతే మేము ముగ్గురమే అవుతాము. ముగ్గురిమీద ఆడనంటాడు కన్నయ్యదొర. ఒక్కొక్కరికి ఒక్కొక్క చాదస్తం" అని ఫిర్యాదు చేసినట్టుగా కాకుండా తన బాధ పైకి వెళ్ళగక్కుకుంటూ, రాజారావు కుర్చీదగ్గరికి జరిగినందుకు సంజాయషీ చెప్పాడు సుందరరామం.

"నేను కాఫీలు తెప్పించానని మీరేం బాధపడనక్కరలేదుగాని, రోజూ ఆడుకొనే పేకాటేగదా, యీవేళ ఓ గంట ఆలస్యమయితేనేం. రాజారావు కేసు డైరీలోంచి ఓ చక్కటి కథవిందాం. ఎక్కడో భోపాల్‌దగ్గర పఠాణీ సంగతి మనకెందుకు? మనిషి విలువ పడిపోతోందనేటందుకు నీకు స్వయంగా అనుభవం వున్న విషయం, నిజంగా జరిగినది ఏదైనా వుంటే చెప్పవయ్యా" అని హెచ్చరించాడు జగన్నాథం రాజారావుని.

కాఫీతాగి రాజారావు సిగరెట్టు ముట్టించాడు. "ఒక్కొక్క సంఘటనను ఒక్కొక్కరు ఒకోవిధంగా గ్రహిస్తారు. ఒకే సంఘటనను విన్నవాళ్ళుగాని, చూసిన వాళ్ళుగాని అందరూ ఒకేమాదిరిగా 'రిసీవ్' చేసుకుంటారనడానికి వీలులేదు. నాకు చాలా ఆశ్చర్యం కలిగించిందీ, నేనే బోల్తాపడినదీ ఒక సంఘటన మీకు చెబుతాను. డబ్బు సంపాదించడంకోసం మనిషి ఎంత నీచానికి దిగజారిపోతాడో మీకే అర్థమవుతుంది. వినండి" అని రాజారావు ఉపక్రమించాడు.

"ఇప్పటికి సుమారు ఒక సంవత్సరం క్రితం నాదగ్గరికి ఒక పెద్దయింటి, సంస్కారం కలిగినదానిలా కనపడే మధ్యవయస్కురాలైన ఆడమనిషి వచ్చి తన కూతురు, పద్దెనిమిది సంవత్సరాల వయస్కురాలైనది కనపడడం లేదనీ, నాలుగు రోజులనుంచి ఎక్కడ వెతికినా దొరకలేదనీ ఫిర్యాదు చేసింది. నేనావిణ్ణి 'పోలీసురిపోర్టు యిచ్చారా' అని అడిగాను, ఆమె యిచ్చానన్నది. కాని పోలీసువారేం చేస్తారు బాబూ, వారి డ్యూటీ వాళ్ళు చెయ్యడానికికూడా మనం వారి చుట్టూ తిరిగి వాళ్ళని ఏదోరకంగా ప్రసన్నుల్ని చేసుకోవాలి. రికమెండేషన్లు చేయించాలి. అంత శక్తీ, స్తోమత నాకెక్కడిది దినం గడవడమే కష్టంగా వుంది మీలాటి మహానుభావుల కాళ్ళట్టుకుంటే మీరైనా కనికరించి నాకు

సాయం చేస్తారని మీదగ్గరికి వచ్చాను' అన్నది.

"ఐతే, నేను మీ అమ్మాయిని వెత కాలా?" అన్నాను

"అమ్మమ్మా, అంత మాట శలవియ్యకండి బాబూ. తమరు ఒక్కసారి సబిన స్పెక్టరుగారిని కలుసుకుని చెబితే, వారు శ్రద్ధగా వెతికించి మా అమ్మాయి ఎక్కడున్నా పట్టుకొని అప్పజెపుతారని నా నమ్మకం" అన్నది.

"మీ అమ్మాయి కనిపించకుండాపోయి ఎన్నాళ్ళయింది? తనంతట తనే వెళ్ళిపోయిందా? ఎవరైనా బలవంతంగా తీసుకుపోయారా? మీరూ, ఆ అమ్మాయి దెబ్బలాడుకున్నారా? కోపంవచ్చి పోయిందా? మీఅమ్మాయి పేరేమిటి? ఎలావుంటుంది? గుర్తులు చెప్పండి అని చాలా విషయాలు ఒక్కటొక్కటే అడిగాను

మా అమ్మాయికి తండ్రి చనిపోయి ఐదు సంవత్సరాలవుతుందండి ఆయన సంపాదించినఆస్తి ఏదోకొద్దిగావుంటే దానితోను, అభిమానం చంపుకొని నారెక్కల కష్టంమీద దాన్ని చదివించుకుంటూ వచ్చానండి. మా అమ్మాయి మెట్రిక్యులేషను ప్యాసయిందండి. నేను అనగూడదుగానండి, అది నా కడుపున పుట్టవలసిన పిల్లగాదండి. ఏ మహరాజుల యిళ్ళల్లోనో, తమలాటివారి కడుపునో పుట్టవలసిన పిల్లండి బంగారపుబొమ్మ, దానికి 'ఉష' అని పేరు పెట్టాము. ఆ పేరు నచ్చలేదని తనే 'ఆశారాణి' అని పేరెట్టుకుందండి. మేము, దాని స్నేహితులూ, 'ఆశ' అని పిలిచేవాళ్ళమండి. దానికి సినీమాల్లోకి వెళ్ళిపోదామని వుండేది. కాని అక్కడ దీన్నెవరు చూస్తారు. అందమొకటీ వుంటే సరా? ఆ మాయప్రపంచంలో నెగ్గుకు రావడానికి ఎన్ని వుండాలి, అని నేనే వెళ్ళనివ్వలేదండి కొన్నాళ్ళు ఉద్యోగం చేస్తానని పట్టుబట్టిందండి. మా వంశంలో ఆడవాళ్ళెవరూ ఉద్యోగాలు చేయలేదండి నాకు దానినో అయ్యచేతిలో పెట్టి అత్తవారింటికి పంపితే నా బరువు, బాధ్యత తీరిపోతాయని వుండేది ఏదో మా స్థితికి తగ్గినట్టుగా మంచి సంబంధాలేమైనా వుంటాయేమోనని వెతుకుతూ వుండేదాన్నండి మేము రామారావుపేటలో ఒక చిన్నయింటిలో వుంటున్నామండి ఆ యింటిదగ్గరే, ఎదురుగా మాకొక శనిగాడు దాపరించాడు వాడు మా అమ్మాయిమీద కన్నేసి మా యింటికి వచ్చి మా అందరితో పరిచయం పెంచుకున్నాడు ఇప్పటికి సరిగ్గా ఐదు రోజుల క్రితం మా అమ్మాయి, వాడు ఒకేసారి కనపడకుండా పోయారండి నేను అన్నివీధులూ వెతికించానండి. ప్రశ్న వేయించానండి. మా అమ్మాయి ఎక్కడో చిక్కడిపోయిందనీ, దొరుకుతుందనీ చెప్పారండి మరో రెండు రోజులుకి ఎక్కడినుండి వచ్చాడో



భాస్కరరావు పెట్టి పట్టుకొని వచ్చాడండి భాస్కరరావు ఎవరా అని అనుకుంటున్నారా? అదేనండి మా యింటికెదురుగా వున్న చచ్చినాడండి. అతన్నడిగితే మా అమ్మాయి సంగతి తనకేమీ తెలియదన్నాడండి తనకేమీ తెలియదని ఋజువు చేసుకునేందుకు కాబోలు వాడు నాతో కలిసి వెతికేవాడు నేను తనకు పెళ్ళి చేయలేననీ, ఆ పరిస్థితులలో దాన్ని ఉద్యోగమైనా చెయ్యనివ్వననీ, సినిమాల్లో చేరనివ్వననీ, నిరాశతో యింట్లోంచి వెళ్ళిపోయి వుంటుంది మా ఆశ. దాన్ని ఏ కిరాతకుడైనా మానభంగంచేసి చంపేశాదేమోనని నా భయమండి తమరు యీ ఫోటో చూస్తే మా అమ్మాయి ఎలా వుంటుందో తమకే బోధపడుతుంది' అని అంటూ ఆశ తల్లి ఒక ఫోటో యిచ్చింది ఫోటోనుబట్టి చూస్తే ఆ పిల్ల చాలా అందంగా వుంది ఆవిడ చెప్పినదంతా వింటే నాకు చాలా జాలి వేసింది ఆమెకు తప్పకుండా సహాయం చెయ్యాలనిపించింది

'మా అమ్మాయి ఎక్కడ వున్నా, ఏ పరిస్థితిలో వున్నా బతికివుంటే చాలండి. రోజులు చాలా దారుణంగా వున్నాయి ఎవరైనా ఏమైనాచేసి దాన్ని చంపేశారేమోనని నా భయమండి మీరే నాకు దిక్కండి" అంటూ ఏడుస్తూ నా కాళ్ళమీద పడింది.

"నేనావిడకు ధైర్యం చెప్పి, ఆశ ఫోటో తీసుకుని ఆ సాయంత్రం పోలీసు

స్టేషనుకు వెళ్ళాను. సబినస్పెక్టరుతో మాట్లాడి ఫోటో యిచ్చాను.

"తర్వాత నాలుగు రోజులకి 'ఆశ' ఆమాకీతీసి పోలీసువారు ఆమెను ఒక వ్యభిచార గృహంనడిపే ఆవిడదగ్గర నుంచి స్వాధీనంచేసుకొని నాకు ఫోన్ చేశారు నేను ఆశ తల్లికి కబురు పంపి ఆమెతో పోలీసుస్టేషనుకు వెళ్ళాను తల్లినిచూసి ఆశ చాలా సిగ్గుపడి, తన దురవస్థకు ఏడ్చింది ఎవరో దుర్మార్గుడు తనకి ఉద్యోగం యిప్పిస్తానని ఆశపెట్టి తీసుకువెళ్ళి వ్యభిచారగృహం నడిపే కంపెనీ' యజమానురాలి యింటిలోచేర్చి వెళ్ళిపోయినట్లు చెప్పింది ఆ కంపెనీ యజమాని ఆశను ఐదువందల రూపాయలకు కొన్నాననీ, వాడెవడో ఆశ మేనమామ నని చెప్పి ఆమెను తనకు అమ్మాడనీ, ఆశవల్ల అంతవరకూ తనకేమీ ఆదాయం రాలేదనీ, గోలపెట్టి చెప్పింది పోలీసువారు కంపెనీ యజమానురాలిని దెబ్బలాడి, మందలించి పొమ్మన్నారు. కేసుపెట్టకుండా వదిలేస్తున్నందుకు సంతోషించమన్నారు. ఆశను ఆమె తల్లికి అప్పగించారు

"మరో నెళ్ళాలయిన తర్వాత ఆ సబ్‌యినస్పెక్టరుకు కాకినాడనుంచి రాజమండ్రీ బదలీ అయింది మరో నెల్లాళ్ళకు నేను రాజమండ్రీ కోర్టుపనిమీద వెళ్ళినపుడు ఆ సబ్‌యినస్పెక్టరుగారిని కాకతాళీయంగా హోటలు అప్సరలో కలుసుకున్నాను

"ఆ రోజున ఆ సబినస్పెక్టరుగారు నాకు చెప్పిన విషయం తలుచుకుంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది. ఆయన నాతో యిలా అన్నాడు.

''చూడండి ప్లీడరుగారూ, కాకినాడలో నేను వున్నప్పుడు మీరు ఆశ అనే అమ్మాయి తల్లితో వచ్చి ఒక రిపోర్టు యిచ్చారే, వాళ్ళు యిప్పుడు యీ వూళ్ళోనే వున్నారు అవిడ యీ వూళ్ళో యింకో ప్లీడరుగారిని పట్టుకొని అదేమాదిరి రిపోర్టుతో మా స్టేషనుకు వచ్చింది. నన్ను యిక్కడ చూసి గతుక్కుమంది కాని నా డ్యూటీ నేను చేశాను. వ్యభిచార గృహాలన్నీ గాలించి ఆ అమ్మాయిని పట్టుకొని తల్లికి అప్పగించాను. కాని నాకు అనుమానంవేసి ఆమాకీ తీశాను ఆ తల్లే తన తమ్ముడిచేత తన కూతుర్ని కంపెనీలకు ఐదు వందలూ, అంతకంటె ఎక్కువకు అమ్మిస్తూ వుంటుంది తన కూతురు చచ్చిపోయిందేమో, ఎవరైనా చంపివేశారేమో, కనబడడం లేదని రిపోర్టు యిస్తుంది. ప్లీడర్లదగ్గరకు వెళ్ళి వారికి జాలి కలిగేలాగ ఏడుస్తూ తన కధంతాచెప్పి వారిని నమ్మిస్తుంది ప్లీడర్లకు ఫీజు యివ్వకుండా వారిచేత. మాచేత పని చేయించుకొని, 'కంపెనీ'లో చిక్కు పడిపోయిన తన కూతురిని యివతలకి రప్పించుకొని

తీసుకు వెళ్ళిపోతుంది మళ్ళీ యింకో దగ్గర అమ్మిస్తుంది. ఈ విధంగా డబ్బు సంపాదిస్తోంది. ఆమె ఆడే తెలివైన నాటకంలో మీలాటివారు, నాలాటివాళ్ళు పావులు కిరాతకుల్లాటి 'కంపెనీ' వాళ్ళకే మస్కాయిస్తోంది ఇంత చదువుకునీ, యింత అనుభని వుండీ మనం తెలివైన వాళ్ళమా, లేక తన పాత్రను బాగా పోషించుకుంటూ, శక్తికట్టిస్తూ నాటకమాడి, డబ్బు సంపాదించే ఆమె తెలివైనదా? కాకినాడలో ఆ పిల్ల పేరు 'ఆశ' ఈ వూళ్ళో హేమ మరో వూళ్ళో మరొకటి"

అని రాజారావు కథ ముగించాడు "ఇప్పుడు చెప్పండి మర్యాదస్థుల కుటుంబంలో పుట్టి కన్నకూతురినే వ్యభిచారగృహానికి అమ్మే తల్లి దిగజారినట్లా కాదా. ఈ పనిలో తమ్ముడు సహాయకారి. దీనినిబట్టి మనిషి విలువ పెరుగుతోందా, తగ్గుతోందా" అని అడిగాడు రాజారావు,

"మనిషికి బ్రతుకుమీద ఆశ చావనప్పుడు, ఎలాగో ఒకలాగ బ్రతకాలి కదా మర్యాదగా, గౌరవ గా బ్రతికే మార్గాలు వారు అన్వేషించకో, అన్వేషించినా దొరకకో, లేక వక్రమార్గం పట్టిన తెలివితేటల ద్వారా కష్టపడకుండా హాయిగా బ్రతుకవచ్చుననే భ్రమతోనో, యిలాటివాళ్ళు యీ విధమైన వ్యూహాలు పన్నుతారు. అలాగే ఎవళ్ళ తంటాలు వాళ్ళు పడతారు మనం కొన్ని నియమాలు, నిబంధనలు, స్టాండర్డ్సు పెట్టుకొని, ఆ కోణంలోంచే చూసి, ఎదటివాళ్ళు, యిలాటి పనులు చేసేవాళ్ళు దిగజారి పోయారంటాము వ్యభిచారంతో, దొంగతనంతో, మోసంతో బ్రతకడం తుచ్ఛమైనదే; నేను కాదనను కాని ఆ పరిస్థితులు సమాజంలో ఏ ఒక్కరికీ లేకుండా సమాజమూ, ప్రభుత్వమూ కృషిచేయాలి. అటువంటి బ్రతుకు బ్రతకవలసిన అవసరం లేకుండాచేసినప్పుడు యింకా అటువంటి పనులెవరైనా చేస్తే వాళ్ళని కఠినంగా శిక్షించాలి. నేను నీతో వాదించకపోతే యీ కథ మాకు తెలిసేదికాదు గదా" అంటూ యింటికి వెళ్ళడానికి లేచాడు యింజనీరు జగన్నాథం.